క్లుప్తంగా

పాఠశాలలో వివేకానంద వర్ధంతి



దుగ్గిరాల: స్వామి వివేకానంద యువతను శక్తివంతం చేయడానికి ఎన్నో స్ఫూర్తిదాయక ఉపన్యాసాలు చేశారని దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం యస్.శోభాదేవి తెలిపారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా పాఠశాల ఆవరణలోని వివేకానంద విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వివేకానంద బోధనలు, ఉపన్యాసాలు విద్యార్థులు తెలుసుకుని ఆచరించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరో బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం



మంగళగిరి: బెటాలియన్ సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ద్వారా సేవలందించడం అభినందనీయమని బెటాలియన్ ఐజీ రాజకుమారి అన్నారు. శుక్రవారం బెటాలియన్ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బెటాలియన్ అధికారులు, సిబ్బంది వైద్యపరంగా మరిన్ని సేవలందించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కమాండెంట్ నగేష్, అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, డాక్టర్లు వీవీ భాస్కర్, హేమంత్, హిమని, బసవేశ్వరరావు, కిరన్మయి తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామంలో శుక్రవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు అందించినట్లు ఫిరంగిపురం పశువైద్యాధికారి బి.సాల్మన్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నట్టల నివారణతో జీవాలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పేగుల్లో ఉండే క్రిములు నశిస్తాయని దాని ద్వారా జీవాలు ఆరోగ్యవంతంగా ఎదుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకం దారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీలు

తాడికొండ: తుళ్లూరు మండలం పెదపరిమి, వడ్డమాను గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయాధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పెదపరిమి మన గ్రోమోర్, వడ్డమాను వెంకటేశ్వర ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహించిన ఏవో పి.సంధ్యారాణి విత్తన లైసెన్సులు, నిల్వలు, స్టాక్ బోర్డు, ధరల పట్టిక, ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లు, బిల్లులు పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తాడేపల్లి రూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి ప్రకాష్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గురజాల నియోజకవర్గం, దాచేపల్లి మండల, పెద్దగార్లపాడుకు చెందిన కట్టా దుర్గాప్రసాద్(30) 2023లో వివాహం చేసుకుని భార్య పావనితో మంగళగిరి రూరల్ యర్రబాలెంలో నివాసం ఉంటున్నాడు. ఉద్యోగం చేసుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో గురువారం రాత్రి స్నేహితుల దగ్గరకని వెళ్లాడు. తెల్లవారు జామున తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

బాబు మోసాలను ఎండగట్టిన వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి టౌన్ /మంగళగిరి: మంగళగిరి నగర పరిధిలోని బైపాస్ రోడ్‌లో గల వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అంబటి రాంబాబు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు బాబు మోసాలను ఎండగడుతూ మాట్లాడారు. నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల వివిధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయ కర్తలు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులలర్పిస్తున్న అంబటి రాంబాబు, మురుగుడు హనుమంతరావు, దొంతిరెడ్డి వేమారెడ్డి

బాబు ష్యూరిటీలపై నిలదీద్దాం..



చంద్రబాబు ఎన్నికల్లో బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గారెంటీ అంటూ నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. నిరుద్యోగ భృతి లేదు. 20 లక్షల ఉద్యోగాల మాట గాలికి వదిలేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ వల్ల యువతకు ఉద్యోగాలు వచ్చాయని చెబుతూ నిరుద్యోగ భృతి ఎగ్గొట్టారు. ఇదే జగన్‌కు, చంద్రబాబుకు మధ్య ఉన్న తేడా.

– ఆకురాతి రాజేష్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు

కార్యకర్తలకు అండగా ఉంటాం..



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కష్ట సుఖాల్లో తోడుగా, అండగా ఉంటాం. కేసులకు భయపడవద్దు. చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీ సామాజిక వర్గంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి రూ.1500 ఇస్తానన్న బాబు ఒక్క పైసా కూడా ఇవ్వకపోవడం దారుణం. నవరత్నాల పథకం ద్వారా జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తే చంద్రబాబు సూపర్ సిక్స్ ద్వారా ప్రజలను దారుణంగా మోసం చేశారు.

– ఈదులమూడి డేవిడ్‌రాజు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

గ్రామాల్లో చేసిన వాగ్దానాలను ప్రశ్నించాలి..



కూటమి నాయకులు ఎన్నికలకు ముందు గ్రామాల్లోకి వచ్చి చేసిన వాగ్దానాలపై ప్రజలు ప్రశ్నించాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రం అప్పులపాలు అవుతోందని బాధపడిన చంద్రబాబు ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అంతకు మించి అప్పులు చేసి పాలిస్తున్నాడు. అప్పుడు జగన్ డీబీటీ ద్వారా ప్రజల అకౌంట్లలో సంక్షేమ ఫలాలు వేస్తే, నేడు చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశాడు. ఇప్పుడు అమలు కాని హామీలతో మభ్యపెట్టి సుపరిపాలన అంటూ కొత్త నాటకాన్ని ప్రారంభించి గ్రామాల్లోకి వెళుతున్నారు. ప్రజలే వారికి బుద్ధి చెబుతారు.

– నాళి వెంకటకృష్ణ, మంగళగిరి రూరల్ అధ్యక్షులు

ఏం సాధించారని 'సుపరిపాలన'..



ఏడాది పాలనంతా దగానే. ఏం సాధించారని చెప్పి ఇప్పుడు కూటమి ప్రభుత్వం సుపరిపాలన పేరుతో కార్యక్రమాలు చేపడుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే సుపరిపాలన పేరుతో ప్రజలే స్వాగతించేవారు. నేడు ప్రజలే కూటమి ప్రభుత్వంపై తిరగబడే రోజులు దగ్గర పడ్డాయి.

– బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు

జగన్ అంటే నమ్మకం - బాబు అంటే మోసం..



నేడు ప్రజలు జగన్ అంటే ఓ నమ్మకం అని ఇప్పుడు కూటమి పాలన చూశాక తెలుసుకున్నారు. జగన్ చేసేదే చెబుతాడు. బాబు చేయలేని పనులు కూడా హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేయడంలో మొనగాడు. అందుకే ప్రజలు జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలనే తలంపుతో చంద్రబాబు మోసాలను నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు.

– అమరా నాగయ్య, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు

రైతులను వంచించిన ప్రభుత్వం మనజాలదు..



ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటకు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు డబ్బు లు వేయలేదు. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతుల ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం దాదాపు 100రోజులు అయినా డబ్బులు వేయకుండా అన్నదాతలను అవస్థల పాలు చేస్తోంది. రైతులను మోసంచేసిన ఏ ప్రభుత్వం కూడా మనజాలదని.. గతంలో నే చంద్రబాబు ప్రభుత్వాల చరిత్రలే చెబుతున్నాయి. – శివగోపయ్య, దుగ్గిరాల మండల అధ్యక్షులు

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం



తాడికొండ: అర్జీదారులు అందజేసిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఏపీ సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అన్నారు. రాజధాని రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరు సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రీవెన్స్ రీడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి పి.జయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కేఎస్ భాగ్యరేఖ, పి.పద్మావతి, ఏజీ చిన్నికృష్ణ, జి.రవీందర్, జి.భీమారావు, సీఆర్డీయే సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పాండు రంగారావు, రామకృష్ణన, సామాజిక సంక్షేమ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పి.కృష్ణమోహన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు పలువురు తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యను విస్తృతంగా ప్రచారం చేయాలి

దుగ్గిరాల: ప్రభుత్వం అందించే ఉచిత విద్య, హాస్టల్ వసతుల గురించి గ్రామ స్థాయిలో ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సేవా సంఘం ప్రెసిడెంట్ అద్దేపల్లి క్రిష్టాఫర్ అన్నారు. దండోరా వేయించి ప్రభుత్వ విద్యను ప్రచారం చేయాలని గ్రామ సర్పంచ్ యార్లగడ్డ చంద్ర దుర్గాభవానీకు ఆయన వినతి పత్రం అందజేశారు. మంచికలపూడిలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు 3 నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు కల్పిస్తున్న ఉచిత విద్య, హాస్టల్ వసతి సౌకర్యాలపై దండోరా ద్వారా అందరికీ తెలియజేయాలని కోరారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

మంగళగిరి టౌన్: మంగళగిరి, తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మంగళగిరి విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని కేకే టవర్స్, ఎస్ఎల్‌వీ అపార్ట్‌మెంట్ ఏరియా, ఎన్ఆర్ఐ విల్లాస్ రోడ్, కొండపనేని టౌన్‌షిప్, పెద్ద పెట్రోల్ బంక్ రోడ్, రత్నాలచెరువు రోడ్డు, బైపాస్‌రోడ్ ప్రాంతం.. రూరల్ పరిధిలోని నవులూరు, ఉడా కాలనీ, శిబిరం, బాపూజీ నగర్, నిడమర్రు టిడ్కో గృహసముదాయాలు.. తాడేపల్లిలోని మహానాడు 1వ రోడ్డు నుంచి మణిపాల్ హాస్పటల్ వరకు.. అలానే కుంచనపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని.. వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిందితుడిపై కేసు నమోదు

ముప్పాళ్ళ: మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బొల్లవరం అడ్డరోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా టాటామినీ ట్రక్కులో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఫిరంగిపురం మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన మొహిద్దీన్‌పీరా అనే వ్యక్తి ఇళ్ల వెంబడి తిరిగి రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తూ ఉంటాడని విచారణలో వెల్లడైనట్లు ఎస్సై తెలిపారు. బియ్యం ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని మొహిద్దీన్‌పీరాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదల పెన్నిధి వంగవీటి రంగా



రంగా జయంతి కార్యక్రమంలో వంగవీటి రాధా



రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీరాం మూర్తి

తాడేపల్లి రూరల్: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతిని శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి రంగా, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, చిలుకోటి శ్రీనివాస మధు, కాపు సంఘం నాయకులు కిషోర్, మాజీ మహిళా పట్టణ అధ్యక్షురాలు అప్పికట్ల సంపూర్ణ పార్వతి, ఎస్సీ సెల్ నాయకులు చిన్నబోతుల దుర్గారావు పాల్గొన్నారు. రాధారంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో మహానాడులో నిర్వహించిన రంగా జయంతి వేడుకలల్లో ఆయన కుమారుడు వంగవీటి రాధా పాల్గొన్నారు. రంగా చిత్రపటానికి పూలమాలు వేసి రాధా నివాళులర్పించారు. ఆకుల దినేష్, పల్లంటి ఫణి, బత్తుల అజయ్, ప్రజా కాపునాడు యువత అధ్యక్షులు నక్కా రాజా, అడపా నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లిలో జనసేన నాయకులు జొన్న రాజేష్, జనసేన రాష్ట్ర ఐటీ విభాగం కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్‌బాబు ఆధ్వర్యంలో రంగా జయంతిని నిర్వహించారు. పాల్గొన్న ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు వంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గంజి చిరంజీవి, మునగపాటి మారుతిరావు, సామల నాగేశ్వరరావు, అంబటి తిరువతిరావు, నక్క రాజేష్, ఠాగూర్, రాజా రమేష్, తిరుమలశెట్టి కొండలరావు పాల్గొన్నారు.

దుగ్గిరాల: దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా జయంతిని ఈమని గ్రామంలో రంగా కూడలి వద్ద శుక్రవారం నిర్వహించారు. దుగ్గిరాల యార్డు మాజీ చైర్మన్ ముప్పాళ్ల శ్రీరాం మూర్తి రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎ.సాయి కృష్ణ, ఎం.కొండలరావు, ఎం.రోశయ్య, నాగరాజు, ఎస్.నాగేశ్వరరావు, ఎ.అర్జునరావు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగా జయంతిని పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు కంతేటి జీవన్ సాగర్, నాయకులు కుర్ర పున్నారావు, కురగంటి చినరత్తయ్య, వీరప్రసాద్, కూర్మాల రాధిక, బొడ్డు రామారావు, మల్లవరపు డానియేల్ పాల్గొన్నారు.

త్యాగ దురంధరుడు అల్లూరి



సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అల్లూరి పేద, బడుగు వర్గాల వారి కోసం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని దేశం మరువదని దుగ్గిరాల ఎంపీపీ షేక్.జబీన్ అన్నారు. దుగ్గిరాల మండల కార్యాలయంలో శుక్రవారం అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో కె.జె.నెహ్రూ, చంద్ర మోహన్, మాజీ ఎంపీపీ వి.కృష్ణ ప్రసాద్, సర్పంచ్ బాణావత్ ఖుషిబాయి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఈనెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో రవాణారంగ కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ.. తాడపల్లిలోని ఆటో, లారీ, ఇతర వాహన డ్రైవర్లు సమ్మెలో పాల్గొనాలని కోరుతున్నామన్నారు. తాడేపల్లి సాయిబాబా గుడి నుంచి 9న కార్మిక ప్రదర్శన జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి పట్టన పరిధిలోని బ్రహ్మానందపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు భవన నిర్మాణ కార్మికులతో ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక రంగం తీవ్రమైన ఇబ్బంది పడుతుందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కూరపాటి స్టీవెన్, పిచ్చయ్య, రమాదేవి, నవనీతం, సుభాని, అంకయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ సమీకరణ గ్రామ సభలు

తాడికొండ: తాడికొండ మండలం గరికపాడు, పొన్నెకల్లు, నిడుముక్కల గ్రామాల్లో శనివారం భూ సమీకరణ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మెహర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గరికపాడులో.. 11 గంటలకు పొన్నెకల్లులో.. మధ్యాహ్నం 12 గంటలకు నిడుముక్కల గ్రామాల్లో సభలు జరగనున్నాయని అన్నారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన సూచించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

తాడికొండ: కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ దేశ వ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడికొండ మండల ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమ్మె నోటీసు మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, నూతక్కి వీరయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దుగ్గిరాల: పేదవాడి ఆకలి తీర్చే రేషన్ బియ్యం అక్రమంగా అర్ధరాత్రుళ్లు తరలిపోతోంది. గురువారం అర్ధరాత్రి ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆటోలో సుమారు 9 బస్తాల రేషన్ బియ్యాన్ని రేవేంద్రపాడు గ్రామంలో స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. డ్రైవరు పరారీలో ఉన్నాడని.. ఆటో, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కి తరలించామన్నారు. ఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎస్ వెంకటరవి పేర్కొన్నారు.

జిల్లా కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిద్దాం

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా రజకులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ ఆగష్టు 25వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య తెలిపారు. శుక్రవారం తాడేపల్లి సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయడంలో సబ్‌కమిటీని ఏర్పాటు చేసే విషయంలో కాలయాపన చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, బొజ్జ సుబ్బారావు, చిక్కవరపు వెంకటరెడ్డయ్య, మడక రాజు, లింగాల నిర్మలమ్మ, రేకులగుంట అంకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.8.50 లక్షల బంగారు వస్తువులు మాయం

విద్యార్థినిపై ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయిని

తాడికొండ: తన ఇంటిలో రూ.8.50 లక్షల విలువైన బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు తాడికొండకు చెందిన ఓ ఉపాధ్యాయిని పోలీస్ స్టేషనల్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండకు చెందిన గోగినేని నమోరాణి అనే ఉపాధ్యాయురాలు గుంటూరు స్తంభాల గరువులోని మున్సిపల్ హైస్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. జూన్ 28వ తేదీన పాఠశాలకు సెలవు పెట్టి ఇంటి వద్ద ఉండగా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో తాడికొండకు చెందిన తన పాత విద్యార్థిని వచ్చింది. నేను మీ ఓల్డ్ స్టూడెంట్‌ని అని చెప్పి పరిచయం చేసుకొని టెన్త్ క్లాస్ మార్కుల లిస్టు కావాలని అడుగుతూ ఇల్లు చూస్తానంటూ లోపలికి వెళ్లి తిరిగి వచ్చింది. అనంతరం తనకు పాలిచ్చే పిల్లాడు ఉన్నాడంటూ వెళ్లిపోయింది. 30వ తేదీన పాఠశాలకు బయలుదేరి చూసుకోగా 6 సవర్ల బంగారపు గొలుసు, 2 సవర్ల తాళిబొట్టు తాడు, 6 సవర్ల లక్ష్మీదేవి రూపు, బెడ్‌రూమ్‌లోని డ్రాయర్‌లో కనిపించలేదు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ప్రాణం తీసిన అతివేగం

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి

తాడేపల్లి రూరల్: అతివేగంగా ద్విచక్రవాహనం నడిపి, అదుపుతప్పి విద్యార్థి మృతి చెందిన సంఘటన శుక్రవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఆత్మకూరుకు చెందిన మాణిక్యరావు, లక్ష్మి దంపతులకు దినేష్ కార్తిక్(20) ఒక్కగానొక్క కుమారుడు. కార్తిక్ ఎన్‌టీఆర్ జిల్లాలోని కంచికచర్లలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన కార్తిక్ బయటకు వెళ్లి వస్తానని చెప్పి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తాడేపల్లి సర్వీస్‌రోడ్డుకు వచ్చే సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కార్తిక్ రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ వీరేంద్రబాబు సిబ్బంది ఎస్ఐ ఖాజావలిని పంపించి వివరాలు సేకరిస్తున్నారు. కార్తిక్ మృతితో బంధువులు, స్నేహితులు హాస్పటల్‌కు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

సిటిజన్స్ కమిటీ సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యసాయి ప్రవీణ్‌చంద్

తాడికొండ: అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిలో సిటిజన్స్ కమిటీ సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుంటామని ఏపీ సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అన్నారు. శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో సిటిజన్స్ కమిటీ చైర్మన్ డి.నారాయణ రావు అధ్యక్షతన కమిటీ 2వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులలో పురోగతి, రాజధాని ప్రాంతంలో అమలవుతున్న సామాజిక సంక్షేమ కార్యకలాపాలను అడిషనల్ కమిషనర్ వివరించారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

తాడికొండ: తుళ్లూరు మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఎంపీడీవో కానూరి శిల్ప పరిశీలించారు. వెలగపూడిలో తాగునీటి శాంపిల్స్ పరిశీలించి ప్రజారోగ్యంపై ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.